క్లుప్తంగా

ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సత్కారం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన పలువురు అధికారులు, సిబ్బందిని సోమవారం వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఘనంగా సన్మానించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో గంటా మేరీ ప్రశాంతి (సూపరింటెండెంట్ – ఎస్టేట్ విభాగం), రెబగొండ్ల ఓబేశ్వరరావు (శానిటరీ సూపర్వైజర్ – ప్రజారోగ్యం విభాగం), పీవీఎస్పీఆర్ శర్మ (జేటీఓ – ఇంజినీరింగ్ విభాగం), ఎ.ధనలక్ష్మి (ఆఫీస్ సబార్డినేట్ – అకౌంట్స్ విభాగం), జేవీ శ్రీనివాస్ (ఎస్టేట్ విభాగం)లను సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా ఈనెల నాలుగో తేదీన నిర్వహించే వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని 42వ డివిజన్ కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం వెన్నుపోటు దినం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగో తేదీన 40వ డివిజన్‌లోని వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీ జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

పలు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదశాత్తు వాహనం ఢీకొని పలువురి ద్విచక్ర వాహనాలు ధ్వంసమైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీకి చెందిన సుగ్గల బాలనాగజ్యోతి వై.జంక్షన్‌లో కిరాణా షాపు నడుపుతోంది. ఆదివారం ఉదయం నాగజ్యోత భర్త శ్రీకాంత్ షాపు ఎదుట బైక్‌ను నిలిపాడు. అదే సమయంలో కొరియర్‌కు చెందిన ఓ వ్యాన్ డ్రైవర్ టీ తాగేందుకు వాహనాన్ని నిలిపాడు. అయితే వ్యాన్‌కు హ్యాండ్ బ్రేక్ వేయకపోవడంతో అది ఆటోమేటిక్‌గా ఇంజిన్ ఆన్ అయి ముందుకు కదిలి నాగజ్యోతి షాపు ఎదుట ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్‌తో పాటు మరికొంత మంది ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న నిరుపేద బాలుడికి వాసవి క్లబ్ అజిత్‌సింగ్‌నగర్ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన కట్టమూరి నాగచైతన్య(14) ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ కారణంగా ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాలుడి కుటుంబ సభ్యుల దీనావస్థను గుర్తించిన వాసవి క్లబ్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కరరావు, జెడ్‌సీ సురేష్, సభ్యులు సోమవారం బాలుడి నివాసానికి వెళ్లి నగదును అందించారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రికలోని ఓ ప్రైవేటు సంస్థలో ప్యాకింగ్ పని చేసే కనపర్తి శ్యామ్(18) అనే యువకుడు ఉరి వేసుకొని మృతిచెందిన సంఘటనపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కనపర్తి శ్యామ్ కండ్రికలోని ఓ ప్రైవేటు సంస్థలో ప్యాకింగ్ పని చేస్తున్నాడు. శ్యామ్ రెండు నెలల క్రితం ఆ సంస్థలో ప్యాకింగ్ వర్కర్‌గా చేరాడు. ఆదివారం సంస్థ ఎగ్జిక్యూటివ్ మల్లేశ్వరి శ్యామ్‌ను పనికిరావద్దని మందలించినట్లు మృతుడు తండ్రికి ఫోను చేసి చెప్పాడు. సోమవారం మధ్యాహ్నం శ్యామ్ కండ్రికలో అద్దెకు ఉంటున్న ఇంట్లో ఇనుపరాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి కనపర్తి వెంకటరత్నం సంస్థ ఎగ్జిక్యూటివ్ మల్లేశ్వరి పనికి రావద్దని చెప్పినందున మనస్తాపం చెంది తన కుమారుడు ఉరివేసుకున్నాడని నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఖాళీ స్థలాలు.. దోమలకు ఆవాసాలు

- గగ్గోలు పెడుతున్న జక్కంపూడి కాలనీవాసులు
- పట్టించుకోని వీఎంసీ అధికారులు



జక్కంపూడి కాలనీలోని ఖాళీ స్థలంలో నిలిచిన వర్షం నీరు



చెత్త, వ్యర్థాలతో కాలనీ మధ్యలో నుంచి వెళుతున్న బుడమేరు కాలువ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి కాలనీవాసులు దోమలతో సహవాసం చేస్తున్నారు. కాలనీలో సాయంత్రం ఆరు దాటితే జనం ఇళ్ల నుంచి బయటకు రావడమే కాదు.. కనీసం ఇళ్లలో కూడా ఉండలేని పరిస్థితి నెలకొంది. కాలనీలోని ప్లాట్ల చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలతోపాటు కాలనీ మధ్యలో నుంచి ప్రవహించే బుడమేరుతో మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు కాలనీలో డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో ఇళ్ల ముందు నిలిచిపోయే మురుగు దోమలకు పునరావాస కేంద్రాలుగా మారుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం రాకముందే వానలు ప్రారంభం కావడంతో ఈ ఏడాది ముందుగానే కాలనీవాసులకు కష్టాలు మొదలయ్యాయి. గత వారంలో కురిసిన భారీ వర్షాలతో కాలనీ మధ్యలో ఉన్న గ్రౌండ్‌లో వర్షం నీరు నిలిచి మురికి కూపంగా మారింది. ఇక వర్షాలు మరింతగా కురిస్తే కాలనీలో పరిస్థితి ఏంటో పాలకులు, అధికారులు ఒకసారి ఆలోచన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దోమలతో అనారోగ్య సమస్యలు

జక్కంపూడి కాలనీ మధ్య నుంచి ప్రవహిస్తున్న బుడమేరు కాలువతో మరిన్ని సమస్యలు తలెత్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కాలువ వెంబడి సుమారు ఐదు వందలకు పైగా ప్లాట్లు ఉన్నాయి. ఆయా ప్లాట్లలో నివసించే వారికి ఒక వైపు కాలువ నుంచి వెలువడే దుర్వాసన, మరో వైపు దోమలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీంతో జక్కంపూడి కాలనీలో ఏ ఇంట్లో చూసినా దోమల చక్రాలు, దోమల అగరబత్తితో పాటు దోమలను చంపే బ్యాట్లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. అయితే దోమల చక్రాలు, అగరబత్తి వల్ల చంటి పిల్లలు, చిన్నారులకు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమ తెరలేవి..?

గతంలో వర్షాకాలం ప్రారంభానికి ముందు ప్రజారోగ్య శాఖ, మలేరియా విభాగాలు కాలనీలో ప్రతి కుటుంబానికి ఒక దోమ తెరను పంపిణీ చేసేవారు. అయితే గత ఏడాది దోమ తెరలను పంపిణీ చేయలేదు. తాజాగా ఈ ఏడాది ఇంత వరకు దోమ తెరల పంపిణీ గురించి మలేరియా విభాగం అధికారులను, సిబ్బందిని ప్రశ్నించినా సమాధానం లేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే దోమ తెరలతో ఏడాది పాటు తమ పిల్లా పాపలు అనారోగ్య సమస్యలు లేకుండా క్షేమంగా ఉండేవారని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే కాలనీలో దోమ తెరలు పంపిణీ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే వీఎంసీ అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో మురుగు నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాణిజ్య లైంగిక బాధిత మహిళల హక్కులు కాపాడండి



సమావేశంలో మాట్లాడుతున్న విముక్తి రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వేశ్యా వృత్తిలో మగ్గుతున్న సుమారు లక్ష 33వేల మంది వాణిజ్య లైంగిక బాధితుల(సెక్స్ వర్కర్స్), మానవ అక్రమ రవాణా బాధిత మహిళల హక్కుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కృషి చేయాలని రాష్ట్ర అక్రమ రవాణా బాధిత మహిళలు, వాణిజ్య లైంగిక బాధితుల సమాఖ్య (విముక్తి) రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ ఆధారిత పునరావాస కార్యక్రమాలతో పాటు చట్ట ప్రకారం అందాల్సిన నష్ట పరిహారాలు, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అంతర్జాతీయ వాణిజ్య లైంగిక బాధితుల (సెక్స్ వర్కర్స్) హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాణిగారితోటలోని కమ్యూనిటీ భవన్‌లో రాష్ట్ర స్థాయి అక్రమ రవాణా బాధిత మహిళలు, వాణిజ్య లైంగిక బాధితుల సమాఖ్య (విముక్తి) లీడర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అపూర్వ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 2021–22 వార్షిక నివేదిక ప్రకారం దేశంలో అత్యధికంగా వేశ్యావృత్తిలోని మహిళల సంఖ్య రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని, దాదాపు 2.25 లక్షల మంది కుటుంబ సభ్యులు ఈ మహిళలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వీరేకాక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లే సెక్స్ వర్కర్స్‌ను కలిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. వీరంతా ప్రభుత్వ సంరక్షణ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరికీ షెల్టర్ హోమ్ ఆధారిత పునరావాసం రద్దు చేసి కమ్యూనిటీ ఆధారిత పునరావాస విధానాన్ని అమలు చేయాలని, అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్స్‌తో కూడిన స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి వారికి తక్కువ వడ్డీతో రుణాలు అందించాలని, ప్రత్యేక కేటగిరీలో ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హెల్ప్ కార్యదర్శి నిమ్మరాజు రామమోహన్, ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి సమస్య పరిష్కారం కావాలి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును అధికారులు పరిష్కారం చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సర్కిల్–1 కార్యాలయంతో పాటు వీఎంసీ ప్రధాన కార్యాలయం, సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత వారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నివేదికలో అధికారులు పరిష్కరించిన దరఖాస్తులను వీక్షించారు. ప్రతి సమస్యకి సరైన పరిష్కారం అందించాలని, ప్రజలకు సంతృప్తికరమైన, శాశ్వతమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం సమస్యలను తెలియపరిచే పురం, ఇతర యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించాలని, ఇప్పటివరకు పురమిత్రలో నమోదైన సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. చిట్టినగర్ సర్కిల్–1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆరు ఫిర్యాదులు రాగా ప్రధానంగా ఇంజినీరింగ్ సంబంధిత సమస్యలు, ఇల్లు కేటాయింపు ఫిర్యాదులను స్వీకరించారు. ప్రధాన కార్యాలయంలో 11 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికకు సంబంధించినవి 3, ఇంజినీరింగ్ 3, రెవెన్యూ సంబంధించినవి 2, వైద్య – ఆరోగ్యంపై 2 ఉన్నాయి. సర్కిల్ 1 కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేఖ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, శానిటరీ సూపర్‌వైజర్ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు

జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పార్లమెంట్‌లో చేసిన వక్ఫ్ బిల్లు సవరణకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీలకు వెన్నుపోటు పొడిచిందని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత షేక్ గౌస్ మొహిద్దీన్ ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను అందిస్తానని ముస్లిం మైనార్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేడు వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు మహానేత వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లతో చేయూతనిస్తే, చంద్రబాబు ఆది నుంచి ముస్లింల ద్రోహిగా వ్యవహరించారని పేర్కొన్నారు. గుంటూరులో యువకులపై దేశ ద్రోహం కేసు నమోదు చేయించి జైల్లో పెట్టించడమే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల నాలుగో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ రోజు భవానీపురం బ్యాంక్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించనున్న వెన్నుపోటు దినం ర్యాలీలో పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొని తమ నిరసన తెలియజేయాలని కోరారు.

రోడ్లపై వర్షంనీరు నిల్వ ఉండకుండా చర్యలు

అధికారులకు వీఎంసీ కమిషనర్ ఆదేశం



వన్‌టౌన్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన సోమవారం వన్‌టౌన్ కృష్ణవేణి క్లాత్ మార్కెట్, అవుట్‌ఫాల్ డ్రెయిన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేయాలని, వర్షం నీరు రోడ్లుపైన నిలవకుండా ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం సమన్వయంతో పనిచేయాలన్నారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఈఈ సురేఖ, డెప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతులేని నిర్లక్ష్యం



పున్నమిఘాట్ వద్ద కృష్ణనదిలో భవానీఐలాండ్‌కు వెళ్లేందుకు బోట్ ఎక్కుతున్న సందర్శకులు



లైఫ్‌జాకెట్స్ ధరించకుండా ప్రయాణిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, నాయకులు, అధికారులు

రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఇతర నాయకులు, సంబంధిత అధికారులు సోమవారం పున్నమిఘాట్ వద్ద బోట్ మారథాన్ కార్యక్రమం నిర్వహించారు. అయితే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రితోపాటు కొంతమంది సందర్శకులు లైఫ్‌జాకెట్స్ ధరించకుండా టూరిజం బోటులో నదిలో ప్రయాణించారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కొంతమంది నిర్లక్ష్యంగా లైఫ్‌జాకెట్స్ లేకుండా ప్రయాణిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ ఆలపాటిపై చర్యలు తీసుకోవాలి

కమ్యూనిస్టు పార్టీల డిమాండ్



మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్, కోటేశ్వరరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు డిమాండ్ చేశాయి. సోమవారం విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్, సీపీఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ శాతవాహన కళాశాలకు సంబంధించిన కేసు కోర్టు పరిధిలో వివాదం నడుస్తోందన్నారు. ఈ సమయంలో బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సభ్య సమాజం తలదించుకునే చర్యకు పాల్పడ్డారన్నారు. దీనికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రూ. వందల కోట్ల విలువ చేసే శాతవాహన కళాశాల సొసైటీ భూమిని కబ్జా చేసేందుకు స్వయంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజా రంగంలోకి దిగి తన అనుచరుల ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును కిడ్నాప్ చేయించారని మండిపడ్డారు. కళాశాల వ్యవహారం కోర్టులో నడుస్తుండగానే ప్రిన్సిపాల్ కిడ్నాప్ కోర్టుధిక్కరణ కిందకు వస్తుందన్నారు. ''మేం అధికారంలో ఉన్నాం.. మేం ఏది చెప్తే అది నీవు చేయాలి.. మేమనుకున్నది జరగాలి, తమకు అనుకూలంగా కళాశాలకు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేయాలి, లేకపోతే చంపుతాం'అనే ధోరణిలో ఆలపాటి చేసిన వ్యాఖ్యలను బాధిత ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మీడియా సాక్షిగా వెల్లడి చేశారంటే.. ప్రభుత్వాన్ని, అధికారాన్ని అడ్డంపెట్టుకొని, ఎమ్మెల్సీ ఏ స్థాయిలో బరితెగించారో అర్థం చేసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ నాయకులు భూపతి రమణారావు, పి. కృష్ణ, లంకా దుర్గారావు, ఎన్ వీరభద్రరావు పాల్గొన్నారు.

బిహార్ కార్మికుడి కిడ్నాప్‌నకు యత్నం

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన భార్యతో మాట్లాడుతున్నాడనే కోపంతో బిహార్‌కు చెందిన వ్యక్తిని కిడ్నాప్ చేసేందుకు యత్నించిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై సకాలంలో సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కంపూడి వైవీ రావు ఎస్టేట్ వద్ద శ్రీదుర్గా ప్లాస్టిక్ అనే పాత ఇనుప సామాగ్రి షాపు ఉంది. ఆ షాపులో బీహార్‌కు చెందిన తాలీబ్ గత నాలుగేళ్లుగా పని చేస్తున్నాడు. తాలీబ్‌తోపాటు వెలగలేరు గ్రామానికి చెందిన వేమూరి లక్ష్మీ, శిరిషా, ప్రియదర్శిని మరికొంత మంది పని చేస్తున్నారు. అయితే కొంత కాలంగా శిరీష తాలీబ్‌తో ఎక్కువగా మాట్లాడుతూ ఉండేది. శిరీషా మూడు రోజుల నుంచి పనికి రావడం మానేసింది. అయితే సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శిరీషా భర్త ఏసీబు తన అన్న ఎలిషా, దొండపాటి అశోక్‌లు కంపెనీలో ఉన్న తాలీబ్‌ను బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని ఎత్తుకెళ్లారు. అదే సమయంలో కంపెనీలో ఉన్న లక్ష్మీ యజమాని తమరాన వెంకటరమణకు ఫోన్ చేసి చెప్పింది. దీంతో హుటాహుటిన కంపెనీ వద్దకు వచ్చిన వెంకటరమణ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వెలగలేరు గ్రామంలో ఏసీబు, ఎలీషాలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కంపెనీ యజమాని ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రారంభమైన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావుబుచ్చయ్యకాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో సోమవారం ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకు స్వామివారికి తిరుమంజన శత అష్టోత్తరంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. అనంతరం సుదర్శన కళశాభిషేకం, ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు స్వామివారి విశేషంగా పుష్పాలు, తులసీదళాలతో అర్చన నిర్వహించారు. అలాగే లోక కల్యాణార్థం లక్ష్మీగణపతి హోమం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈ నెల 5వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రస్ మేకింగ్, జ్యూట్ క్రాఫ్ట్స్, ప్రొడక్ట్ మేకర్ అసిస్టెంట్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజిరేషన్, హోమ్ క్రాఫ్ట్స్, స్క్రీన్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్ ప్రాసెసింగ్ అసిస్టెంట్, జామ్ అండ్ జ్యూస్ మేకింగ్, అసిస్టెంట్ డ్రస్ మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ అసిస్టెంట్, ఫ్యాషన్ జ్యువెలరీ మేకింగ్, మిర్రర్ వర్క్ మొదలైన స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆసక్తి ఉన్న వారు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866–2470420 నంబరులో కాని సంప్రదించాల్సిందిగా కోరారు.

ప్రణాళికతోనే విజయాలు సొంతం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రణాళికతో ముందుకు సాగితే మంచి విజయాలు సొంతమవుతాయని కేబీఎన్ కళాశాల కార్యదర్శి టీ శ్రీనివాసు పేర్కొన్నారు. కేబీఎన్ ఫైన్ జూనియర్ కళాశాల విద్యార్థి బీ దుర్గా శశికిరణ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 1,339వ ర్యాంకు సాధించిన సందర్భంగా సోమవారం కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసు మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకోవాలన్న తపన విద్యార్థులకు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన తమ విద్యార్థి శశికిరణ్ ప్రతిభను గుర్తించి ఫీజు మినహాయింపు ఇచ్చినట్లు చెప్పారు. ఫైన్ కళాశాల ప్రిన్సిపాల్ టీ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే ఆన్‌లైన్ టెస్ట్‌ల ద్వారా సాధన చేయించినట్లు తెలిపారు. కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమ కళాశాల అన్నివిధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జేఈఈ ర్యాంకు సాధించిన శశికిరణ్‌ను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

ఇళయరాజా సంగీత సేవలు వెలకట్టలేనివి



విజయవాడ కల్చరల్: సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీత సేవలు వెలకట్టలేనివని విశ్రాంత పోలీస్ అధికారి కె. డేవిడ్‌రాజు అన్నారు. హ్యాపీ మూమెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై సోమవారం సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా జన్మదిన వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు మాట్లాడుతూ ఇళయరాజా భారతీయ భాషల్లో వచ్చిన అనేక చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించినట్లు తెలిపారు. సీనియర్ గాయని చందన మాట్లాడుతూ ఇళయరాజా స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, మారేపల్లి జోషి పాల్గొన్నారు. చందన ఆధ్వర్యంలో చరణ్, అనిల్, సింధూ, రమ్య, భాస్కర్ ఇళయరాజా సంగీత దర్శకత్వం వహించిన చిత్ర గీతాలను ఆలపించారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కుక్కల దాడిలో ఐదేళ్ల బాలుడు గాయపడిన సంఘటన కొండపల్లి పొట్టి శ్రీరాములు మార్కెట్ సెంటర్‌లో సోమవారం జరిగింది. తన తల్లితో కలిసి మార్కెట్‌లో సరుకుల కోసం వచ్చిన బాలుడు గగన్‌పై అనూహ్యంగా కుక్కలు దాడి చేశాయి. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాలుడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు.